క్లుప్తంగా

మిర్చి యార్డులో ఉచిత నేత్ర వైద్య శిబిరం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డు ఆవరణలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు ప్రారంభించారు. యార్డులో పనిచేసే కార్మికులు, హమాలీలు, వ్యాపారులు, రైతులు, ఉద్యోగులు, సిబ్బంది నేత్ర వైద్యం చేయించుకున్నారు. సుమారు 150 మందికి సుదర్శని సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి డాక్టర్లు వైద్యం అందించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ నిత్యం యార్డులో పనిచేసే కార్మికులు, హమాలీలు, రైతుల కోసం ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి నెల మొదటి గురువారం ఈ శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎన్జీ రంగా సేవలు చిరస్మరణీయం



లక్ష్మీపురం: రైతాంగానికి ఆచార్య ఎన్జీ రంగా అందించిన సేవలు చిరస్మరణీయమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం ఎన్జీ రంగా జయంతి సందర్భంగా ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో అడుగు పెట్టిన ఎన్జీ రంగా తదనంతర కాలంలో రైతుల సమస్యలను గుర్తించి ఉద్యమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. రైతులను భాగస్వాములను చేసి సత్ఫలితాలు పొందారన్నారు. రైతు నాయకులు బి.శ్రీనివాసరావు, సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్ గెలుపే అతి పెద్ద మలుపు




లక్ష్మీపురం: డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికవటం అమెరికా రాజకీయాల్లో అతి పెద్ద మలుపని విశ్లేషకులు ఎస్.సదాశివం అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెరికా 47వ అధ్యక్షుడుగా రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ట్రంప్ గెలిచిన తీరు వివరించారు. విద్యావేత్త ఆర్.వి. సింగరయ్య, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ భారతీయ అమెరికన్లను సైతం పెద్ద సంఖ్యలో ఆకర్షించి ట్రంప్ ఓట్లు పొందారని తెలిపారు. అనంతరం సంస్థ సభ్యులు తదితరులు ప్రసంగించారు.

అమెరికా వర్సిటీ విజిటింగ్ ప్రొఫెసర్‌గా మల్లికార్జున



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బోటనీ అండ్ మైక్రోబయాలజీ విభాగాధిపతి ఆచార్య కె. మల్లికార్జున అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ అలబామాలో రీసెర్చ్ విజిటింగ్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో గురువారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు తదితరులు అభినందించారు. రెండు వర్సిటీల మధ్య ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం కొనసాగుతోందని, అందులో భాగంగా అలబామా వర్సిటీకి చెందిన డాక్టర్ జీపీసీఎం రాజు .. ఏఎన్‌యూకి విజిటింగ్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారని తెలిపారు. ఓఎస్డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆచార్య దివ్య తేజో మూర్తి తదితరులు మల్లికార్జునను అభినందించిన వారిలో ఉన్నారు.

ఈసీజీ టెక్నీషియన్ల నియామకానికి డిమాండ్




గుంటూరు మెడికల్ : ప్రతి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గుండె జబ్బుల నిర్ధారణకు పరీక్షలు చేసే ఈసీజీ టెక్నీషియన్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయాలని పారా మెడికల్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది వందల మంది కోర్సు పూర్తి చేసి బయటకు వస్తున్నారన్నారు.

ముందస్తు నిర్ధారణ.. మెరుగ్గా నివారణ!

- వైద్యరంగంలో రేడియాలజీ పాత్ర కీలకం
- వ్యాధుల గురించి ముందే తెలిసే అవకాశం
- నేడు అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవం





రేడియాలజీ డే పోస్టర్స్

గుంటూరు మెడికల్ : మెదడు , గుండె వంటి శరీరంలోని ప్రధాన అవయవాలకు సోకిన వ్యాధులను నిర్ధారించి రోగులకు చికిత్స మెరుగ్గా అందించేందుకు వైద్యులకు రేడియాలజీ ఎంతగానో సహాయపడుతుంది. రోగికి ఏ జబ్బు వచ్చిందో నిర్ధారించడం దగ్గర నుంచి చికిత్స మధ్యలో ఏ మేరకు తగ్గుముఖం పట్టిందో తెలుసుకోవడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త రాంట్‌జెన్ 1895 నవంబర్ 8వ తేదీన తన భార్య చేతికి మొదటిసారిగా ఎక్స్‌రే తీశారు. తర్వాతి ఏడాది జనవరి నెలలో ఎక్స్‌రేని ప్రజెంట్ చేసి, ప్రపంచానికి అందుబాటులోకి తెచ్చారు. ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవాన్ని 2012 నుంచి ఏటా నవంబర్ 8న నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

రేడియాలజిస్టులు కీలకం...

వైద్యరంగంలో పేరుగాంచిన వైద్యులకు వెన్నెముకలా నిలిచి వ్యాధి నిర్ధారణను సకాలంలో కచ్చితత్వంతో నిర్ధారించేది రేడియాలజిస్టులే. పెద్ద ఆపరేషన్లు చేసే వైద్యులు వీరిచ్చే రిపోర్టే కీలకం. పలు స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యులంతా రోగులకు వైద్యసేవలను అందించే విషయంపై రేడియాలజిస్టులు ఇచ్చే రిపోర్ట్‌పైనే ఆధారపడతారు. రేడియోగ్రఫీలో ప్రముఖంగా ఎక్స్‌రే, అల్ట్రాసోనోగ్రామ్, సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ వంటి పరీక్షల ద్వారా రోగ నిర్ధారణ చేస్తారు. వైద్య చికిత్సలు అందించేందుకు ఈ రిపోర్టులు దోహదపడుతున్నాయి. రేడియోగ్రఫీపై వైద్యులు, ప్రజలు అవగాహన పెంచుకుంటే ప్రజారోగ్యాన్ని మరింత మెరుగుపరిచే అవకాశం ఉంటుంది. రేడియాలజీలో వచ్చిన ఆధునిక వైద్య పద్ధతులు, వైద్య పరికరాల ద్వారా త్వరితగతిన వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి రోగులకు సకాలంలో సేవలు అందించేలా రేడియాలజిస్టులు కృషి చేస్తున్నారు.

గర్భిణులకు ఉపయోగకరం



గైనకాలజీ విభాగంలో రేడియాలజీ సేవలు చాలా కీలకం. గర్భిణికి 11 - 14 వారాల్లో స్కానింగ్ చేసి పుట్టబోయే బిడ్డకు జన్యుపరమైన లోపాలు గుర్తించవచ్చు. టిఫా స్కానింగ్ పరీక్ష ద్వారా గర్భంలో బిడ్డ ఎదుగుదలను పరిశీలించే అవకాశం ఉంది. కిడ్నీలు, లివర్, నెలసరి సమస్యలు, పేగుల్లో, ఓవరీస్‌లో క్యాన్సర్లు, పొట్టలో ఆరోగ్య సమస్యలను ముందస్తుగానే తెలుసుకుని చికిత్స చేయవచ్చు.

– డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి – ప్రసూతి, సంతాన సాఫల్యత వైద్య నిపుణురాలు, గుంటూరు

గుండెపోటును గుర్తించే అవకాశం



రేడియాలజీలో ఆధునిక వైద్య పద్ధతుల ద్వారా ఆరోగ్య సమస్యలను ముందస్తుగానే స్క్రీనింగ్ చేసి తెలుసుకోవచ్చు. ఎంఆర్ఐ స్కానింగ్‌లో అతి సూక్ష్మమైన వ్యాధుల సమస్యలను సైతం గుర్తించవచ్చు. హార్ట్ ఎటాక్ వస్తుందా? రాదా? అనే విషయం కార్డియాక్ సీటీ ద్వారా ముందుగానే తెలుసుకోవచ్చు. గర్భంలో ఉండే శిశువు ఆరోగ్యం, ఇతర సమస్యలు అల్ట్రాసౌండ్ పరీక్ష ద్వారా ముందుగా గుర్తించి చికిత్స చేయవచ్చు.

– డాక్టర్ చక్కా సుజాత, సీనియర్ రేడియాలజిస్ట్, గుంటూరు

రేడియాలజిస్టుల సేవలు కీలకం



వైద్య రంగంలో ఎంతో క్లిష్టమైన వ్యాధుల నిర్ధారణలో రేడియాలజిస్టుల పాత్ర కీలకం. నానాటికీ విస్తరిస్తున్న వైద్య రంగంలో వీరికి డిమాండ్ పెరుగుతూనే ఉంది. వారి సేవలు వెలకట్టలేనివి. విధి నిర్వహణలో రేడియేషన్‌కు కూడా గురవుతుంటారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,200 రేడియాలజిస్టులు ప్రస్తుతం సేవలను అందిస్తున్నారు.

– డాక్టర్ చిటితోటి కిషోర్‌కుమార్, ఏపీ రేడియోలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



వర్క్‌షాప్‌లో ప్రొఫెసర్ శ్రీనివాసకుమార్, వెంకటేశ్వరరావు, సురేష్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు కాలానుగుణమైన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని మలినేని లక్ష్మయ్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ డి. శ్రీనివాసకుమార్ పేర్కొన్నారు. గురువారం జేకేసీ కళాశాలలో డేటా సైన్స్‌పై వర్క్‌షాప్ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ.. నూతన సాంకేతికతను నేర్చుకోవడం ద్వారా విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలను పొందే సమయంలో ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ పి. గోపీచంద్ మాట్లాడుతూ... డేటా సైన్స్‌పై రెండు రోజులపాటు జరగనున్న వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులకు చేకూరనున్న ప్రయోజనాలు వివరించారు. వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ వై. సురేష్‌బాబు మాట్లాడుతూ... కంప్యూటర్ సైన్స్‌లో నూతన ఆవిష్కరణలను అందిపుచ్చుకోవాలని సూచించారు. వర్క్‌షాప్‌లో కో-కన్వీనర్ వై. వెంకటేశ్వరరావు, పిక్సిటీ ఈడీఎక్స్ ట్రైనర్ సీహెచ్ రాధ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తా చాటిన ప్రభుత్వ కళాశాల



విద్యార్థినులతో ప్రిన్సిపల్ జ్యోత్స్నకుమారి, పీడీ కృష్ణవేణి




విద్యార్థినులను అభినందిస్తున్న అనితాదేవి, జయ శైలజ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 6వ తేదీన జరిగిన అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి తెలిపారు. గురువారం సాంబశివపేటలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. పది విభాగాల్లో విద్యార్థులు పాల్గొని ఆరు బంగారు, మూడు రజత, ఒక కాంస్య పతకాన్ని సాధించారని అన్నారు. ఈ నెల 24 నుంచి ఏఎన్‌యూ వేదికగా జరగనున్న దక్షిణ భారత విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు కళాశాలకు చెందిన బీఏ ప్రథమ సంవత్సర విద్యార్థిని ఆర్. గాయత్రి, బీఏ తృతీయ సంవత్సర విద్యార్థిని బి.నానీ ఎంపికైనట్లు తెలిపారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ అనిశెట్టి కృష్ణవేణి, సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ కోచ్ ఎండీ కమరుద్దీన్ ఆధ్వర్యంలో వారికి శిక్షణ ఇచ్చామని చెప్పారు. విద్యార్థినులను ప్రిన్సిపల్ తదితరులు అభినందించారు.

టీజేపీఎస్ కళాశాల విద్యార్థినులు ...

గుంటూరు ఎడ్యుకేషన్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 6న జరిగిన అంతర్ కళాశాలల మహిళా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో టీజేపీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. అనితాదేవి తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థిని జి.శృతి 64 కేజీల విభాగంలో ద్వితీయ స్థానం సాధించినట్లు చెప్పారు. జి.లావణ్య లహరి 74 కేజీల విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ.. విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల కోసం పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్‌లలో ఉచితంగా శిక్షణ ఇప్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థినులను కళాశాల పాలకమండలి అధ్యక్షుడు కె. శ్యాం సుందర్, కమిటీ సభ్యుడు నాగ సుందరం, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, కోచ్ కె. ఉదయ్ కిరణ్, వ్యాయామ అధ్యాపకుడు ఆర్. శివాజీ, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు ఆర్. జయ శైలజ, డాక్టర్ జేవీ సుధీకుమార్ అభినందించారు.

రచయిత్రులకు ఆచార్య ఎన్జీ రంగా ఫౌండేషన్ సత్కారం



రచయిత్రులను సన్మానిస్తున్న దృశ్యం

నగరంపాలెం: రైతు సమస్యలపై పోరాడిన ఆచార్య ఎన్జీ రంగా జీవితం భావితరాలకు స్ఫూర్తిదాయకమని ప్రముఖ సాహితీవేత్త ముత్తేవి రవీంద్రనాథ్ అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆయన జయంతి వేడుకలు, సాహిత్య పురస్కార ప్రదానోత్సవ సభ -2024 బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం ఆవరణలోని పద్మావతి కళ్యాణ వేదికపై నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల మనిషిగా ఎన్జీ రంగా నిరాడంబర జీవితాన్ని గడిపారని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు మాట్లాడుతూ.. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే తొలిసారిగా తెలుగు రచయిత్రుల నుంచి కథలను పోటీలకు ఆహ్వానించగా మంచి స్పందన లభించిందని అన్నారు. వారు పంపిన కథలను పుస్తక రూపంలో త్వరలో వెలువరిస్తామని చెప్పారు. పురస్కార గ్రంథ సమీక్ష డాక్టర్ వి. నాగరాజ్యలక్ష్మి చేశారు. కథల పోటీల్లో ప్రథమ బహుమతి 'బతుకు సేద్యం' (రచయిత్రి శాంతి ప్రబోధ), ద్వితీయ బహుమతి 'పచ్చబొట్టు' (రచయిత్రి పి.సుజాత), విశిష్ట బహుమతి 'నీలంపు రాసి' (రచయిత్రి చంద్రలత) కైవసం చేసుకున్నాయి. ఈ సందర్భంగా రచయిత్రులను సత్కరించి, నగదు పురస్కారం అందించారు. దేవస్థానం పాలకమండలి అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య, డాక్టర్ కందిమల్ల సాంబశివరావు, డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు, కవులు రచయితలు, ఆచార్య ఎన్జీరంగా అభిమానులు పాల్గొన్నారు.

శ్రీశైలం కాపు సత్రం కమిటీ సభ్యుడిగా విజయ్



నగరంపాలెం: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంలోని శ్రీకృష్ణ దేవరాయ బలిజ సత్రం (కాపు సత్రం) ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా గుంటూరు నగరానికి చెందిన బాలిశెట్టి విజయ్ నియమితులయ్యారు. ఈ మేరకు ట్రస్ట్ నిర్వాహకులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. రెండోసారి ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యునిగా అవకాశం రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ప్రస్తుతం ఆయన గుంటూరులోని కాపు హాస్టల్‌కు ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు.

మరో ఇద్దరు మందుబాబులకు జైలు శిక్ష

నగరంపాలెం: మద్యం మత్తులో వాహనాలు నడిపి పట్టుబడిన ఇద్దరికి ఐదు రోజులు జైలు శిక్ష విధిస్తూ ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.లత గురువారం తీర్పు చెప్పారు. పశ్చిమ ట్రాఫిక్ పీఎస్ సీఐ సీహెచ్.సింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరిని కోర్టులో హాజరు పరిచామని అన్నారు. వారికి ఐదు రోజులు జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దని సీఐ తెలిపారు.

కాంక్వెస్ట్‌కు ఏఎన్‌యూ వీసీకి ఆహ్వానం

ఏఎన్‌యూ: కోల్‌కత్తా భక్తివేదాంత ఇనిస్టిట్యూట్, విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లు సంయుక్తంగా డిసెంబర్ 28, 29వ తేదీలలో నిర్వహించనున్న 'సైన్స్ అండ్ స్పిరిచువల్ కాంక్వెస్ట్' అఖిల భారత సదస్సుకి ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావును ఆహ్వానించారు. ఈ మేరకు భక్తి వేదాంత ఇనిస్టిట్యూట్ సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డీన్ శ్రావణ్ కుమార్ వీసీకి గురువారం వర్సిటీలో ఆహ్వానపత్రిక అందజేశారు. వీసీని కలిసిన వారిలో ప్రొఫెసర్ రవికుమార్, బాలుర వసతి గృహాల చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ దివ్య తేజ మూర్తి, ఫార్మసీ కళాశాల అధ్యాపకుడు కె.విజయ్ కిషోర్ తదితరులు ఉన్నారు.

పీఎఫ్ రుణాల మంజూరుకు వినతి



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఉపాధ్యాయులకు పీఎఫ్ రుణాలు మంజూరు చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుంటూరు నగరపాలక సంస్థలో గతంలో పనిచేసి నేడు విద్యాశాఖ పరిధిలోకి వెళ్లిన నేపథ్యంలో వారి పీఎఫ్ ఖాతా లోన్లు ఉపాధ్యాయులకు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఖలీల్, నగరశాఖ అధ్యక్షుడు సాయి విశ్వనాథ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లు, డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు ముమ్మరంగా కొనసాగుతోంది. ఆక్రమణదారులు ఇకనైనా స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించుకోవాలని, లేదంటే నగరపాలక సంస్థ సిబ్బందే పూర్తి స్థాయిలో తొలగిస్తారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. గురువారం ఆక్రమణల తొలగింపుపై పట్టణ ప్రణాళిక అధికారులతో, ఇంజినీరింగ్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగర పరిధిలో దశలవారీగా చేపట్టిన ఆక్రమణల తొలగింపు ముమ్మరంగా సాగుతోందని చెప్పారు. అమరావతి రోడ్, గోరంట్ల మెయిన్ రోడ్, జీటీ రోడ్, నల్లపాడు రోడ్లలో ఆక్రమణలు తొలగిస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో తిరిగి ఆక్రమణలు జరగకుండా ప్లానింగ్ కార్యదర్శులు పర్యవేక్షించాలని ఆదేశించారు. డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టాలని, తీసిన పూడికను వెంటనే తరలించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

పరేడ్‌కు ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఎంపిక



ఎంపికైన వారిని అభినందిస్తున్న దృశ్యం

ఏఎన్‌యూ: ప్రీ రిపబ్లిక్ పరేడ్‌కు ఏఎన్‌యూ విద్యార్థులు ఎంపికయ్యారని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ దివ్యతేజోమూర్తి తెలిపారు. ఆర్కిటెక్చర్ కళాశాల నుంచి ఎం.శిరీష, తెనాలి జేఎంజే మహిళా కళాశాల నుంచి జి.చంద్రిక, గుంటూరు హిందూ కళాశాల నుంచి సీహెచ్ రుత్విక్ బాబు, బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఎ.గణేష్‌లు ఈ పరేడ్‌లో పాల్గొంటారని చెప్పారు. వలంటీర్లను గురువారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు అభినందించారు. రెక్టార్ ఆచార్య కె. రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఓఎస్డీ ఆచార్య ఆర్‌వీఎస్ఎస్ఎన్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డి. శ్రీనివాసరావు, ఆచార్య కె.వి.నిరుపమ, సీహెచ్ ఉమాశంకర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కావూరి శ్రీనివాసరావు, కె కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నెల రెండో గురువారం కార్మికులకు గ్రీవెన్స్ డే



యూనియన్ నాయకులతో సమావేశమైన కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో పని చేసే ప్రజారోగ్య, ఇంజినీరింగ్ విభాగ కార్మికులు తమ సమస్యలపై అర్జీలు అందించేందుకు ప్రతి నెల రెండో గురువారం మధ్యాహ్నం 3 - 4 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ డే నిర్వహిస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారంపై గురువారం తన చాంబర్‌లో లీడ్ బ్యాంక్ మేనేజర్, వివిధ కార్మిక సంఘాల నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరపాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల వారీగా కార్మికుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ డే నిర్వహించనున్నామని తెలిపారు. సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామన్నారు. వార్డ్ సచివాలయాల వారీగా ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు తమ పరిధిలోని కార్మికులకు ఉన్న పీఎఫ్ సమస్యలపై రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం కార్మిక సంఘాల నాయకులు వివిధ సమస్యలపై అందించిన అర్జీలను తీసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సీహెచ్ శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ మణిపాల్ రెడ్డి, వివిధ కార్మిక సంఘాల నుంచి మాల్యాద్రి, మధుబాబు, శంకర్రావు, రవి కుమార్, ముత్యాలరావు, కమల్ పాల్గొన్నారు.

వైద్య పరికరాల కొనుగోలుకు విరాళం



చెక్కును డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణకు అందజేస్తున్న దృశ్యం

గుంటూరు మెడికల్: జన్యుపరమైన వ్యాధితో బాధపడే తన కుమార్తెకు మెరుగైన వైద్యం అందించిన గుంటూరు జీజీహెచ్ మానసిక వైద్య విభాగ వైద్యులకు కన్నవారు కృతజ్ఞతలు తెలిపారు. ఆమెకు పూర్తిగా నయం కావడంతో సంబంధిత వైద్య విభాగానికి సైకోమెట్రీ మెషినరీ నిమిత్తం గురువారం రూ. 1.20 లక్షలు విరాళం అందించారు. విభాగాధిపతి డాక్టర్ నీలి ఉమా జ్యోతి మాట్లాడుతూ.. సేవలు పొందిన వారు ఇలా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సాయం అందజేయడం అభినందనీయం అన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ, మానసిక వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పసుపుల సాయికిరణ్, డాక్టర్ రత్న, పీజీ వైద్యులు పాల్గొన్నారు.

భార్యపై దాడి చేసిన భర్తపై కేసు నమోదు

లక్ష్మీపురం: భార్యను రాడ్డుతో తీవ్రంగా కొట్టి గాయపరిచిన ఘటనలో భర్తపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. రామిరెడ్డినగర్ ప్రాంతానికి చెందిన కట్టపల్లి జ్యోత్స్న, రవీంద్ర దంపతులు. 12 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఇద్దరు సంతానం ఉన్నారు. రవీంద్ర గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని సేఫ్టీ కౌన్సిలర్‌గా పనిచేస్తున్నాడు. 2023లో కూడా కుటుంబ గొడవల విషయమై తెనాలి పోలీసులు కేసు నమోదుచేశారు. పెద్దలు వచ్చి ఇద్దర్ని కలిపారు. ఈ నెల 2వ తేదీన ఇంటి పని చేసుకుంటున్న జ్యోత్స్నను రాడ్డుతో తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. స్థానికుల సహాయంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆమె గురువారం రాత్రి నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో దాడికి యత్నించిన భర్తపై ...

కొండా వెంకటప్పయ్య కాలనీకి చెందిన మహబూబున్నిసాకు సుభానితో పది సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. వీరి మధ్య మనస్పర్థలు రావడంతో పరస్పరం కేసులు పెట్టున్నారు. ఈ క్రమంలో 5వ తేదీన కోర్టుకు వచ్చిన మహబూబున్నిసాపై భర్త సుభాని, అత్త, తోడి కోడళ్లు దాడి చేసేందుకు యత్నించారు. దుర్భాషలాడారు. గురువారం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందించి సమస్యలు వివరిస్తున్న ఏపీ హంస నేతలు

గుంటూరు మెడికల్: వైద్య ఆరోగ్య శాఖలో సమస్యలను పరిష్కరించాలని గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణకు వినతిపత్రం అందించారు. ఏపీ హంస అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అర్జపాల్ ఆధ్వర్యంలో యూనియన్ నేతలు కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. రాష్ట్ర సెక్రటరీ శ్రీనివాస్, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బి.కిరణ్, జిల్లా ప్రెసిడెంట్ బి.నాగవర్ధన్‌రెడ్డి, విజయవాడ సిటీ ప్రెసిడెంట్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మెప్మా సిబ్బందికి అవగాహన సదస్సు

నెహ్రూనగర్: ఐటీసీ బంగారు భవిష్యత్, ఫీనిక్ష్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లిటరసీ అంశంపై మెప్మా సిబ్బందికి గురువారం నగరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపు సభ్యులు అందరూ జీవిత, ఆరోగ్య బీమా పొందాలని పేర్కొన్నారు. పలు పథకాలపై అవగహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఉపా సెల్ పీడీ రారావు, మెప్మా సీఎంఎంలు, ఆర్పీలు పాల్గొన్నారు.